క్లుప్తంగా

బెట్టింగ్‌లకు పాల్పడితే చర్యలు


మాట్లాడుతున్న ఎస్‌ఐ లోకేశ్వరరావు

మెరకముడిదాం: సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై బెట్టింగులకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని బుధ రాయవలస ఎస్‌ఐ బి.లోకేశ్వరరావు హెచ్చరించారు. బుధరాయవలస పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల కోడ్ ఇంకా అమలులో ఉందని, ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని సూచించారు. రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు కాని, అభిమానులు కాని ఎవరైనా ఎన్ని కల గెలుపు, ఓటములపై బెట్టింగ్‌లకు పాల్పడినా, గొడవలకు దిగినా చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని చెప్పారు.

నిబంధనలు పాటించాలి


కెల్ల గ్రామపెద్దలతో మాట్లాడుతున్న డీఎస్పీ చక్రవర్తి

గుర్ల: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున, నిబంధనలను అనుసరించి గ్రామ దేవత పండగను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని కెల్ల గ్రామ పెద్దలకు చీపురుపల్లి డీఎస్పీ చక్రవర్తి సూచించారు. కెల్ల గ్రామంలో సోమవారం నుంచి గ్రామదేవత పండగ నిర్వహించనున్న నేపథ్యంలో ఆ గ్రామపెద్దలతో స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఆదివారం ఆయన సమావేశమయ్యారు. పండగ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయకూడదని చెప్పారు. ఎన్నికల కోడ్ ఉన్నందు న ఎటువంటి ఘర్షణ జరిగిగా గ్రామ పెద్దలే బాధ్యతలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సీఐ షణ్ముఖరావు, ఎస్‌ఐ భాస్కరరావు పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరం


నేత్ర పరీక్షలు చేస్తున్న శంకర్‌ఫౌండేషన్ కంటి ఆస్పత్రి సిబ్బంది

మెరకముడిదాం: స్థానిక పీహెచ్‌సీలో శంకర్ ఫౌండేషన్, సహాయ స్ఫూర్తి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి చెందిన ఆప్తాలమిక్ జాక్సన్ శిబిరంలో 94 మందికి నేత్ర పరీక్షలు చేశారు. వీరిలో 46 మందికి నేత్ర శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. వీరందరికీ విశాఖ పట్నంలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్‌లు చేయించనున్నామని శంకర్ ఫౌండేషన్ ప్రతినిధులు సీహెచ్.వెంకటరమణ, పవిత్ర తెలిపారు. పీహెచ్‌సీ సిబ్బంది రామారావు, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

దత్తిరాజేరు: భూసారం పెంచేందుకు దోహదం చేసే పచ్చిరొట్ట విత్తనాలు మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని ఏఓ అనురాధ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కట్టె జనుమ, జీలుగు, పిల్లిపెసర విత్తనాలు కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో వీఏఏల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. 50 శాతం రాయితీపై విత్తనాలు అందించనున్నట్లు పేర్కొన్నారు.

వికసించిన మే పుష్పాలు


విరబూసిన పుష్పాలు

శృంగవరపుకోట: ఏడాదిలో మే నెలలో మాత్రమే మే పుష్పం వికసిస్తుంది. ఎస్.కోట పట్టణంలోని గాంధీనగర్ 3వ వీధిలో ఉన్న వైద్యారోగ్యశాఖ విశ్రాంత ఉద్యోగిని మనోరమ ఇంట్లోని పెరటిలో అరుదైన మే పుష్పాలు వికసించాయి. ఒక పూలతొట్టెలోని మొక్కకు మూడు పుష్పాలు వికసించి, చూపరులను ఆకట్టుకుంటున్నాయి.

అప్రమత్తతతోనే జీవాలకు రక్షణ



- తొలకరి వర్షాల ప్రారంభంలో జీవాలకు వ్యాధులు సోకే ఆస్కారం

లక్కవరపుకోట: గొర్రెలు, మేకల పెంపకందారులు అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు పాటిస్తే జీవాలను వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవచ్చని భీమాళి పశువైద్యాధికారి సింగంపల్లి సత్యనారాయణ అన్నారు. వర్షా కాలంలో సాధారణంగా వ్యాధులు విజృంభిస్తుంటాయి. ప్రస్తుతం అడపాదడపా కురుస్తున్న వర్షాలు, రుతుపవనాలు వచ్చిన తర్వాత కురిసే వర్షాల వల్ల జీవాలకు వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. వర్షాలతో వాతావరణంలో కలిగే మార్పులు జీవాలకు హాని కలిగిస్తాయి. చిరుజల్లులకు పచ్చిక బయళ్లు పెరుగుతాయి, చెరువుల్లో కొత్త నీరు చేరుతుంటుంది. కొత్త పచ్చిక చిగుళ్లను అనేక క్రిములు ఆశి స్తాయి. వీటిని గొర్రెలు, మేకలు తినడం వల్ల, చెరువుల్లోని కొత్త నీటిని తాగడం వల్ల పలు వ్యాధులు సోకే అవకాశం ఉంది. నిర్లక్ష్యం చేస్తే జీవాలు అనారోగ్యానికి గురై చనిపోయే ప్రమాదముంది. అందుకే వర్షాకాలం ప్రారంభంలో జీవాల పెంపకం దారులు అప్రమత్తంగా ఉండాలని, సకాలంలో అవసరమైన టీకాలు వేయించాలని పశువైద్యాధికారి సత్యనారాయణ సూచించారు.

మసూచి వ్యాధి: ఈ వ్యాధిని గ్రామాల్లో బొబ్బ, అమ్మోరు,అమ్మతల్లి వ్యాధి అంటారు. ఎప్పుడైనా ఈ వ్యాధి సోకే ప్రమాదం వుంది.గొర్రెల్లో ఈ జబ్బు తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఈ వ్యాధి వైరస్ వల్ల వ్యాపిస్తుంది. గాలి, నీరు, ఆహారం, స్పర్శ వల్ల ఈ వ్యాధి ఒకదాని నుంచి వేరొక దానికి సోకుతుంది. ఈ వైరస్ సోకిన వారం తర్వాత 108 డిగ్రీల జ్వరం వస్తుంది. శరీరంపై ఎర్రటి పొక్కులు, దద్దుర్లు ఏర్పడతాయి. కళ్ల నుంచి నీరు, నోటి నుంచి చొంగ, ముక్కు నుంచి చీమిడి కారుతుంది.శ్వాస పీల్చుకోవడం కష్టంగా ఉంటుంది. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే పశువైద్యాధికారిని సంప్రదించి టీకాలు వేయించాలి. వ్యాధి బారిన పడిన జీవాలను మంద నుంచి వేరు చేయాలి.

చిటుకు వ్యాధి: ఇది బ్యాక్టీరియా వల్ల వచ్చే వ్యాధి. దీనినే గడ్డి రోగం, మెడసారం, మచ్చువ్యాధి, పారుడు రోగం అని కూడా అంటారు. ఈవ్యాధి వల్ల గొర్రెల్లో మరణాలు ఎక్కువగా సంభవిస్తాయి. క్లాస్ట్రీడియం ఫెర్ఫ్రెంజెన్స్ అనే క్రిమి ఉన్న గడ్డిని మేసిన గొర్రెల్లో ఈ క్రిమి ఎప్సిలాన్ అనే విష పదా ర్థా న్ని విడుదల చేస్తుంది. అప్పుడు వ్యాధి లక్షణాలు బయటపడతాయి. తొలకరి వర్షాలు కురిసిన తర్వాత ఏపుగా పెరిగిన కొత్త పచ్చికను అతిగా మేయడం వల్ల ఈ వ్యాధి వస్తుంది. ఈవ్యాధి సోకిన జీవాలు ఆరోగ్యంగా ఉన్నట్లే కనిపిస్తాయి. రాత్రి బాగా ఉండి తెల్లవారే సరికి చనిపోతాయి. హటాత్తుగా గాల్లో ఎగిరి ఎగిరి పడి చిటుకలో మృత్యువాత పడతాయి. జ్వరం, పల్లుకొరకడం, వణకడం, బిగుసుకపోవడం, కాళ్లతో పొట్టపై తన్నుకోవడం, శ్వాస కష్టంగా తీసుకోడం, తలను గోడకు, చెట్టుకు ఆనించి ఉంచడం, విరోచనాలు, కడుపు నొప్పి వంటివి వ్యాధి లక్షణాలు. సాధారణంగా చికిత్స చేసే లోపలే మరణిస్తాయి. విరేచనాలు తగ్గించడానికి నెబ్లాన్ పౌడర్ 10 నుంచి 15 గ్రాములు నీటిలో కలిపి తాగించాలి. సెలైన్‌లు ఎక్కించడంతో పాటు మూడు నుంచి అయిదు రోజుల పాటు యాంటీ బయాటిక్, నొప్పి నివారణ మందులు ఇవ్వా లి. తొలకరి వర్షాలు ప్రారంభ సమయం మే నెలలోనే టీకాలు వేయించాలి, మొదటి టీకా వేసిన 15 రోజుల తర్వాత బూస్టర్ డోస్ వేయించాలి. టీకాలు వేసే రెండు మూడు రోజుల ముందు నట్టల నివారణ మందులు వేయాలి. జీవాలు అధికంగా మేత మేయకుండా చూసుకోవాలి. అలాగే లేత పసర గడ్డిని, వాడిపోయిన లేత గడ్డిని జీవాలు మేయకుండా చూడాలి. గొర్రె పిల్లలు ఒకేసారి అధికంగా పాలు తాగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. మేకలకు పూర్తిగా పప్పు జాతి పశుగ్రాసం అందించ కూడదు.

గాలికుంట వ్యాధి: దీనిని ఫుట్ అండ్ మౌత్ వ్యాధి అని కూడా అంటారు. ఇది గొర్రెల్లో ఆగస్టు నుంచి డిసెంబర్ నెలల మధ్య ఎక్కువగా సోకే ప్రమాదం ఉంది. దీనినే పోచమ్మరోగం, గాలి పోచమ్మ అంటారు. ఈ వ్యాధి వైరస్ ద్వారా వ్యాప్తి చెందుతుంది. వ్యాధి బారిన పడిన జీవాల శ్వాస వల్ల విడుదలయ్యే గాలి ద్వారా మిగిలిన జీవాలకు ఇది వ్యాప్తి చెందుతుంది. తీవ్రమైన జ్వరం, నాలుక మీద, కాలి గిట్టల మధ్య ఎర్రబారి పుండ్లు ఏర్పడడం ఈ వ్యాధి లక్షణాలు. నోటి నుంచి చొంగ కారుతుంది. గొర్రె పిల్లలకు ఈ వ్యాధి సోకితే వెంటనే మరణించే అవకాశం ఉంది.ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గరలో గల పశువైద్యాధికారిని సంప్రదించి టీకాలు వేయించాలి.

సుందరయ్యకు నివాళి


సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

గజపతినగరం: కమ్యూనిస్టు నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని మండల కేంద్రంలోని జయంతి కాలనీలో సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి సీపీఎం జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాట్లాడుతూ జీవితమంతా ప్రజాసేవకే అంకితం చేసిన త్యాగధనుడు పుచ్చలపల్లి సుందరయ్య అని అన్నారు. శాసన సభలో ప్రతి పక్ష నాయకుడిగా హుందాగా ప్రజా సమస్యలపై గల మెత్తిన వ్యక్తిగా పుచ్చలపల్లి పేరు సంపాదించారని అన్నారు.ఆడంబరాలకు దూరంగా ఉంటూ ఆదర్శవంత జీవితం గడిపి, రాజకీయాలంటే ప్రజలకు సేవచేయడమే మని నిరూపించారని అన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జి.శ్రీనివాస్, సభ్యులు కనకరాజు, శ్రీను, కోటి, భాస్కరరావు,ఏసు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కెల్ల గ్రామదేవత పండగ

గుర్ల: మండలంలోని కెల్ల గ్రామంలో సోమవారం నుంచి బుధవారం వరకు గ్రామ దేవత అసిరితల్లి పండగ నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు ఆదివారం తెలిపారు. సోమవారం తొలేళ్ల ఉత్సవం, మంగళవారం రథోత్సవం, బుధవారం కనుమ పండుగ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా తగిన ఏర్పాట్లు చేశామని చెప్పారు.

మోస్తరు వర్షం


ఖాసాపేటలో కురుస్తున్న వర్షం

లక్కవరపుకోట: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. వేసవి దుక్కులకు, వరి నారుమడులు తయారీకీ ఈ వర్షం ఎంతో ఉపయోగపడుతుందని రైతులు అంటున్నారు. ఉదయం నుంచి ఎండతో అల్లాడిన ప్రజలు ఈవర్షంతో ఉపశమనం పొందారు.

నేడు పైడితల్లి దేవర మహోత్సవం

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారి దేవర మహోత్సవం సోమవారం సాయంత్రం 4.30 గంటలకు ప్రారంభమవుతుందని ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. స్థానిక రైల్వేస్టేషన్ వద్ద ఉన్న ఆలయంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తామన్నారు. అనంతరం మేళతాళాలతో, భాజాభజంత్రీలతో అమ్మవారిని ఊరేగింపుగా హుకుంపేటలో ఉన్న సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు ఇంటివద్దకు తరలిస్తామన్నారు. అక్కడ నుంచి అదేరోజు రాత్రి పెద్దచెరువు పశ్చిమభాగాన పూజారి, తలయారులు, జాలరులతో కలిసి అమ్మవారికి మనవి చెప్పి ఘటాలను తీసుకొస్తామన్నారు. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి అమ్మవారు చదురుగుడిలో భక్తులకు దర్శనమిస్తారన్నారు. నాటి నుంచి పైడితల్లి అమ్మవారి జాతర ముగింపు ఉయ్యాల కంబాల మహోత్సవం వరకు అమ్మవారు చదురు గుడిలోనే భక్తులకు దర్శనమిస్తారన్నారు. దేవర మహోత్సవంలో భక్తులందరూ పాల్గొని, అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

ఏసు ప్రేమాలయంలో ప్రత్యేక ప్రార్థనలు

విజయనగరం టౌన్: ప్రభువైన యేసుక్రీస్తు ఆశీర్వాదాన్ని ప్రతి ఒక్కరూ ప్రార్థన ద్వారా పొందాలని స్థానిక అంబటిసత్రం వద్ద ఉన్న ఏసు ప్రేమాలయం చర్చి పాస్టర్ అలజంగి రవి కుమార్ అన్నారు. ప్రపంచ ప్రార్థన దినోత్సవాన్ని పురస్కరించుకుని చర్చి ఆవరణలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచశాంతి, సౌభ్రాతత్వం వర్ధిల్లాలని, ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షించారు. ఉద్యోగ, ఉపాధి, పరిశ్రమలు, మానసిక ప్రశాంతత, ఆర్థికాభివృద్ధి వంటి అంశాల్లో పురోగతి సాధించాలని ప్రార్థించారు. కార్యక్రమంలో విన్‌స్టన్, సువర్ణమ్మ, ఝాన్సీ, సుజన్, కీర్తి, నాగేశ్వరరావు, విక్టర్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

సాహితీ సంస్థ కృషి అద్భుతం


సాహితీ సమాలోచన సదస్సులో మాట్లాడుతున్న గౌరినాయుడు

లక్కవరపుకోట: సాహిత్య రంగంలో, అనువాదంలో ఆంధ్రవిశ్వ కళాపరిషత్ విశ్రాంత భౌతిక శాస్త్ర ఆచార్యులు చందు సుబ్బారావు నెలకొల్పిన సాహితీ సంస్థ చేస్తున్న కృషి అమోఘమని మండలంలోని కిత్తన్నపేట గ్రామానికి చెందిన యువ సాహితీవేత్త ,రాచకొండ నరసింహశర్మ సాహితీ సంస్థ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కిలారి గౌరినాయుడు అన్నారు. విశాఖపట్నంలో సాహితీ సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సాహితీ సమాలోచన సదస్సుకు ప్రత్యేక అతిథిగా ఆయన హాజరయ్యారు. సాహితీరంగ ప్రతినిధులు ఆచార్య జగ్రా అప్పారావు రచనల గురించి, సామాజిక సేవా రంగానికి అందిస్తున్న సేవలను, ఆంధ్రవిశ్వకళాపరిషత్ తెలుగుశాఖ అభ్యున్నతికి చేస్తున్న సేవలను సభలో ప్రత్యేకంగా గౌరినాయుడు ప్రసంగించారు. సాహిత్య విమర్శ–సామాజిక విశ్లేషణ అనే అంశంపై చర్చా గోష్టిలో అతిథి ఉపన్యాసం చేశారు. ద్రవిడ విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ప్రొఫెసర్ కె.ఎస్.చలం, ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ముర్ర ముత్యాలనాయుడు, ఎమ్మెల్సీ ఆచార్య కుంబా రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో వేపాడ హైస్కూల్ 1992-93 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

వేపాడ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992–93 విద్యా సంవత్సరంలో పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పేరిట విశాఖ పట్నంలోని ఓ హోటల్ వేది కగా ఆదివారం కలుసుకున్నారు. పదోతరగతి పూర్తయిన తర్వాత వేర్వేరు ప్రాంతాల్లో చదువుకుని, వివిధ రంగాల్లో స్థిరపడిన స్నేహి తులంతా 32 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో వారి ఆనం దానికి అవధులు లేకుండా పోయాయి. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. రోజంతా సరదాగా గడిపారు.

రెండు దశాబ్దాల తర్వాత..

వేపాడ: స్థానిక శ్రీ విక్టరీ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో 2001–2002 విద్యాసంవత్సరంలో పదోతరగతి చదువుకున్న పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆ పాఠశా ల వేదికగా ఆదివారం జరిగింది. రెండు దశాబ్దాల తర్వాత కలుసుకోవడంతో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, కుటుంబ సభ్యుల యోగక్షేమాలను పరస్పరం ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. నాటి ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య ప్రతినిధులు నిరుజోగి దాలినాయుడు, కిశోర్, ముత్యాలునాయుడు, రాఘవ తదితరులు పాల్గొన్నారు.



వేపాడ విక్టరీ హైస్కూల్ 2001-2002 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

వైశాఖ ఏకాదశి పూజలు


గాయత్రీదేవి ఆలయంలో శ్రీనివాస కల్యాణంలో పాల్గొన్న దంపతులు


పూజలు అందుకుంటున్న సూర్యనారాయణ స్వామి


దేవి జంక్షన్‌లోని గణపతి ఆలయంలో సత్యనారాయణస్వామి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

శృంగవరపుకోట: వైశాఖమాసం, ఏకాదశి కావడంతో ఆదివారం ఎస్.కోట పట్టణంలోని పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, హోమాలు, కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక దేవీ జంక్షన్‌లో ఉన్న లక్ష్మీగణపతి ఆలయంలో శ్రీరమా వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి కల్యాణోత్సవాన్ని పురోహితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన పలువురు ఈ కల్యాణోత్సవంలో పాల్గొన్నారు.

ఆదిత్యునికి పూజలు

పుణ్యగిరి రోడ్డులోని సూర్యదేవాలయంలో ఛాయా, ఉషా, పద్మిని సమేత సూర్యనారాయణస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి అభిషేకాలు చేసిన అనంతరం అర్చనాది కార్యక్రమాలు చేశారు. భక్తులకు ప్రసాద వితరణచేశారు.

శ్రీనివాస కల్యాణం

ఎస్.కోట పట్టణంలోని విశాఖ–అరుకు రోడ్డులో ఉన్న గాయత్రీదేవి ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి,భూదేవి,సమేత కల్యాణ వెంక టేశ్వరస్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. ఉత్సవ మూర్తులను మండపంలో వేదికపై ఏర్పాటు చేసి, సర్వాంగ శోభితంగా అలంకరించి, ఆలయ పురోహితుడు కల్యాణం చేయించారు.పట్టణానికి చెందిన భక్తులు కల్యాణ కర్తలుగా వ్యవహరించి స్వామివారి పెళ్లి జరిపించారు. భక్తులకు తీర్థ, ప్రసాదాలు వితరణ చేశారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం


చీపురుపల్లిరూరల్(గరివిడి): మందిరవలసలో పుస్తకపఠనంపై అవగాహన కల్పిస్తున్న ఆశయ రమణ


లక్కవరపుకోట: ఎల్.కోట గ్రంథాలయంలో సమ్మర్ క్యాంప్ వాల్ పోస్టర్లను చూపిస్తున్న విద్యార్థులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతుందని, జ్ఞాన సముపార్జనకు పుస్తకాలు ఎంతో దోహదపడతాయని చీపురుపల్లికి చెందిన ఆశయ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ అన్నారు. గరివిడి మండలంలోని మందిరవలస రచ్చబండ వద్ద ఆశయ రూరల్ లైబ్రరీ ఆధ్వర్యంలో పుస్తకపఠనంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఆదివారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎక్కువ కాలం మొబైల్ ఫోన్లతోనే గడు పుతున్నారని, సమయాన్ని వృథా చేస్తున్నారని అన్నారు. తల్లిదండ్రులు బాధ్యత తీసుకుని వారికి పుస్తక పఠనంపై ఆసక్తి పెంచేలా కృషి చేయాలని సూచించారు. పుస్తకాలు చదవడం వల్ల వారిలో ఆలోచన శక్తి పెరుగుతుందన్నారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాలు

కొత్తవలస/లక్కవరపుకోట: గ్రంథాలయశాఖ ఆధ్వర్యంలో కొత్తవలస, లక్కవరపుకోట మండల కేంద్రాల్లోని శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు కొనసాగుతున్నా యి. శిబిరాలకు విద్యార్థుల హాజరు సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోందని ఆయా గ్రంథా లయాల లైబ్రేరియన్‌లు దామోదర్, బి.మేరి, రామలక్ష్మి తెలిపారు. లక్కవరపుకోట గ్రంథాలయంలో చిన్నారులకు ఆదివారంచదరంగం,క్యారమ్ బోర్డు వంటి ఇండోర్ గేమ్‌లు నేర్పారు. కొత్తవలసలో విద్యార్థులతో నీతి కథల పుస్తకాలను చదివించారు.

అన్నమయ్య జయంతి వేడుకలకు సర్వం సిద్ధం


ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న సేవా సంఘం ప్రతినిధులు

విజయనగరం టౌన్: అన్నమయ్య వేడుకలకు సర్వం సిద్ధం చేసినట్లు శ్రీవారి స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు ఎం.భీష్మారావు తెలిపారు. కార్యాలయం ఆవరణలో ఆదివారం సాయంత్రం వేడుకలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీవారి స్వచ్ఛంద సేవా సంస్థ, ఘంటసాల స్మారక కళాపీఠం సంయుక్త నిర్వహణలో ఈ నెల 23న సాయంత్రం 6 గంటల నుంచి గురజాడ కళాభారతి వేదికగా అన్నమయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్‌సీఎస్ గ్రూప్ డైరెక్టర్ నారాయణం శ్రీనివాస్ హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రత్యేక ఆకర్షణగా భక్తుల సందర్శనార్థం 12 అడుగుల వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని వేదికపై ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. వర్ధమాన గాయనీ, గాయకులతో అన్నమయ్య భజన కీర్తనలు, ఇండియన్ ఐడెల్ ఫేమ్ పవన్‌కుమార్‌తో ప్రత్యేక సంగీతాలాపన వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. సంగీతాభిమానులు, భక్తులు అందరూ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు గ్రంధి విష్ణుమూర్తి, వైవీవీ సత్యానారాయణ, ధవళ సర్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.